# వెలుతురు నిండిన నవ్వు

-శాంతి ప్రభాకర్

చంద్రయ్య పొలం గట్టు మీద కూర్చున్నాడు. పంచ, పైబట్ట మాసి వున్నాయి. జుట్టు చిందర వందరగా వుంది. మొహం నీరసంగా ఉంది. తలలో ఎన్నో విధా లైన ఆలోచనలు. "ముత్తాత నుంచి వస్తున్న ఈ కాస్త ఆధారం కూడ పోతోంది. తన అరెకరం కొంద్రని ప్రభుత్వం అడుగుతోంది. దానికి ఎల కట్టి ముదరా ఇస్తుందట. తనకేమి నట్టం రానివ్వమని పెద్దోళ్ళం దరూ చెబుతున్నారు. భూమిని వొగ్గేయమని ఒకటే పోరుతున్నారు. రెండు నాళ్ళ నుంచి ముద్ద కూడా దిగటల్లే. ఏం చేయాలో పాలోవటంలే. ఒప్పేసుకోవా లేమో!" తనలో తనే అనుకుంటున్నాడు చంద్రయ్య.

"అయ్యోయ్! సీకటోయింది పురుగూ, పుట్రా వుండొచ్చు. ఇక లెగు. ఇంటికాడ మాటాడుకోచ్చు." సాయి దూరం నుంచి గట్టిగా అరిచాడు.

చంద్రయ్య పెద్దగా ఊపిరొదిలి పైకి లేచాడు. పై బట్ట దులిపాడు ఇంటిదారి పట్టాడు.

❖ ❖ ❖

చంద్రయ్యకు వారసత్వంగా వచ్చిన ఆస్తి ఆ చిన్న చెక్క, వుండేందుకు పాక.

ఆ జానెడు పొలంలో వరి పండించి కాలక్షేపం చేస్తున్నాడు. ఆరుతడి సేద్యం పొలంలో చిన్న బావి కూడా వుంది. మోటు కట్టి నీళ్ళు చేదుతూ వుంటాడు. వర్షాలు బాగా పడి బావి నిండితే. లేకపోతే చినుకే ఆధారం. ఒక్కొక్కప్పుడు పంట చేతికొస్తుంది. కాని పంట పండని ఏళ్ళే ఎక్కువ. సంసారం చిన్నది కాబట్టి బండి లాగుతున్నాడు. భార్య రత్తమ్మ. ఒక్కడే కొడుకు సాయి. "మనసెరిగి మసలుతాది రత్తి. ఈ సాయి మాత్రం పట్టుదలకు పోతాడు. అడి మాటే చెల్లాలని మొరాయిత్తాడు. మాట ఇనకపోతే యాగం చేత్తాడు" సంగటి ముద్ద సాయించలేదు చంద్రయ్యకు. గిన్నె ముందునుంచి లేచాడు.

"ఏందయ్యా! రెండు ముద్దలు కూడా తిన్లే. ఇల్లాగ వుంటే ఎట్టా?" రత్తి తనలో తనే గొణుక్కుంది.

చంద్రయ్య చుట్టముట్టించి నులక మంచం మీద నడుం వాల్చాడు. ఊళ్ళ వాళ్ళ మాటలు గుర్తు కొచ్చాయి. "చందిరిగా నీకేంట్రా. సాయి చేతికం దొచ్చాడు. డిగ్రీ కాయితం వచ్చింది గందా. రేపా మాపో మంచి ఉజ్జోగం వస్తాది. నువ్వు కాలుమీద కాలేసుకుని సీకూ సింతా లేకుండా వుండొచ్చు. డబ్బులు ఆడే యిత్తాడు. పైగా నీ కొంద్రకు మంచి రేటు యిత్తున్నారు గందా! నీకు గుబులెందుకూ" శీనయ్య మాటలు గుర్తొచ్చాయి చంద్రయ్యకు.

❖ ❖ ❖

రాత్రి బాగా పొద్దుపోయింది. వెన్నెల రాత్రుళ్ళు. మంచం మీద పడుకొని ఆలోచిస్తున్నాడు. "తన కొంద్ర! పేనంతో సమానంగా తనకు తన నాయన, తాత, ముత్తాత- అందరికీ ఆ చెక్కే ఆధారంగా ఉండేది. తనకీ అదే జీవనం అయింది. తనకి బతుకంటే డబ్బు, దస్కం కాదు. తన ఆ కాసింత నేల, ఆపైనున్న ఆకాశం, ఆ నేల మట్టి, ఆ నేలలోకి రోజు తొంగిచూసే సూరీడు, అందులో వుండే మొక్క, మాను, పిట్టా, గుట్టా- ఈటన్నింటి తోనూ పెనేసుకున్న ఇలువ కట్టలేని

## మత్తడి

స్పందించె మనసులో
కదిలించే ప్రతి భావనా
కవితగా మత్తడై ప్రవహిస్తుంది.
రాస్తున్నంత సేపు మనసులో
భావోద్వేగాల మధ్య సమరం
రాసేసిన తర్వాత మనసు నుండి
విడిపోయి వేరుపడిన ఆ భావన
ఆత్మీయంగా మనోదర్పణమై
సేద తీరుతున్నా
మనసు లోతుల్నుండి ఇంకా వెలికిరాని
భావ తడి స్పర్శ
ఎన్ని కవితా సంపుటుల్ని నింపుతుందో
మనసు పొరల మధ్య ప్రపంచం
ఎన్ని కవితలకైనా కాలేదు కొలమానం
రాయడమంటూ ప్రారంభమైతే
జీవితకాలమంతా ఆ జీవ
ధార మత్తడి పడుతూనే
ఉంటుంది

-డా॥ జరీనా బేగం

బంధం- అది పేగు బంధం కంటె ఎక్కువగందా! ఏం టొచ్చినా రాకపోయినా ఆ కొంౘ్రనే నమ్ముకుని రోజులు గడిపేత్తున్నాడు. తెలిసినట్లో, తెలియనట్లో అందరూ అంటున్నారు. ఆ కాస్త కొంౘ్ర ఇచ్చేత్తే నీకేం నట్టం? ముదరగా డబ్బు ఇస్తుంది గందా. అంత డబ్బును నీ జీయితంలో చూడగలవా! నువ్వో పిచ్చోడిలా వున్నావు. అవకాశం వదులుకోమాక. నిన్ను బామాలుతున్నారని చెట్టెక్కకురోయ్. మిగిలిన దినాలు నీకూ సింతా లేకుండా జరిగిపోతాయి. పైగా ఆ ముక్కనొంచే కొత్త కాలవ తవ్వాలిగందా! దారి ద్వారానే పల్లం ఒళ్ళకు నీళ్ళు పారతాయి. సాటోళ్ళకి కూసింత సాయం చెయ్యరా అని అందరూ పదినాళ్ళ నుండి పోరు తున్నారు. కాని వాల్లెవరు తన గుండెలోని గుబులును చూద్దంలేదు. చివరకు రత్తం పంచుకోని పుట్టిన బిడ్డగాడు కూడా...'' ఆలోచనలలో కొట్టుకుపోతున్నాడు చంద్రయ్య.

చంద్రయ్యకు కంటి మీద కునుకు రాలే. మంచం మీద నుంచి లేచాడు. పొలం వైపు అడుగులు వేశాడు తడబడుతూ.

❖ ❖ ❖

ఆకాశం నిర్మలంగా వుంది. వెన్నెల, చల్లని గాలి. చంద్రయ్య శరీరాన్ని తాకుతున్నాయి. శరీరాన్ని కాదు, అతని హృదయాన్ని పైరగాలికి వరికంకులు ఊగుతు న్నాయి. ఏదో గుసగుసలు ఏళ్ళ తరబడి తన గుండెతో పెనేసుకుపోయిన ఆ చెట్టు, చేమా, మొక్కా మోడు, గున్నమామిడి, పైన మినుకు మినుకంటున్న సుక్కలూ, నేలతల్లి తన్ని నిలేసి అడుగుతున్నట్టనిపిస్తోంది చంద్రయ్యకు. "మమ్మల్ని ఒగ్గేసి డబ్బుకు అమ్ముకొని పోతుండావా" అని చంద్రయ్య కళ్ళలో నీళ్ళు తన మోటబావి దగ్గరకొచ్చాడు. లోకి తొంగి చూసాడు. బావిలో చందురుడు వెటకారం చేస్తున్నట్టనిపించింది. 'డబ్బుకమ్ముడోతున్నావా అంటూ' బావి దగ్గరే నిలబడి పోయాడు.

ఎవరో వచ్చిన అలికిడి. చంద్రయ్య ఎనక్కు చూశాడు. భుజం మీద రత్తమ్మ చెయ్యి పడింది.

"బావుంది యవ్వారం. ఎటెట్లా జరగాలో! దిగులు పడితే సరిపోద్దా ఏంటి! కోడికూసే ఏళయింది. ఒక కునుకు తీద్దువుగా లెగు. అసలే నీరసపడ్డావుగందా" రత్తమ్మ చంద్రయ్య చెయ్యి దొరకబుచ్చుకొని లాక్కెళ్ళింది.

❖ ❖ ❖

పొద్దు పైకెక్కింది. రాత్రంతా చంద్రయ్య ఆలోచించి సమాధానపడ్డాడు. రత్తమ్మ లోటా నిండా కాఫీ ఇచ్చింది. కాఫీ గొంతులో పోసుకొని కండువా భుజం మీద వేసుకొని బయటకు నడిచారు. సర్పంచి వాలు కుర్చీలో కూర్చొని పేపరు చదువుతున్నాడు. చంద్రయ్యను చూసి పేపరు మడిచి కింద పెట్టాడు.

"రా చంద్రయ్యా! ఏం ఆలోచించావ్"

"మీ మాటే ఖాయం అయ్యా. నా కొంౘ్రని ఇచ్చేస్తా"

"అద్దదే! మంచిగా మాట్లాడావు. నాకు చాలా సంతోషంగా వుంది చంద్రయ్యా!"

"అయ్యగోరూ... మరి..."

"మళ్ళీ ఏవో తిరకాసు పెడుతున్నావు"

"తిరకాసేం లేదు బాబూ. ఊరి బయట కూసింత పుంత ఉంది గందా. అది నాకు ఇప్పించండి. నాకు డబ్బు వద్దయ్యా."

"అపుంతా! రాళ్ళూ, రప్పలూ పిచ్చిమొక్కలతో ఎందుకూ పనికిరాని దాన్నేం చేసుకుంటావోయ్"

"పర్లేదయ్యా. అది ఏరికీ పనికిరాదు గందా నాకిప్పించండి. ఆ కాస్త ముక్కను బావుచేసుకొంటా..."

"ఆ కాస్త ముక్కలో ఏం వేత్తవురా! గట్టిగా ఎకరం కూడా లేదు. ఆపైన నీకొచ్చే డబ్బు తగ్గిపోతుంది గందా. బాగా ఆలోచించుకో."

## పత్రిక నానీలు

డాలర్ / జాలరై వలవేసింది
రూపాయి / అమ్మ బొట్టులా వెనక్కి లాగింది

ఆమె / వృత్తికి అంకిత
అతడామెకు అలంకృత
సంసారం అచుంబిత

ఆదిశక్తి అంటే / సంతోషించను
ఆమె శక్తి అనండి / చాలు

రాళ్లను చీల్చుకొచ్చింది / మొక్క
ఇక నీళ్లు
చిన్నబుచ్చుకున్నాయి.

కవిత్వం
నా ఒంటికి పడుతుంది
మా ఇంటికీ
పడితే బావుండు.

-డా॥ ఎమ్. విజయశ్రీ

"బాగా ఆలోచించానయ్యా. ఆ కొత్త పుంతా నాకిప్పించండి పైసలు తక్కువొచ్చినా పర్లేదు."

సర్పంచి చంద్రయ్య వైపు చూస్తూ వుండిపోయాడు. చంద్రయ్య అమాయకత్వానికి అతనికి జాలేసింది. కాని చంద్రయ్య ఖరాఖండిగా చెప్పేసాడు.

"సరేలే చంద్రయ్యా. అంతా నీ ఇష్టప్రకారమే కానిద్దాం. ఆ పుంత నీకొచ్చేట్టు చేస్తా. పైన డబ్బేమైనా వస్తే ఇప్పిస్తా. ఈ కాగితాల మీద సంతకం చెయ్యి."

చంద్రయ్య కాగితాల మీద నిశాని వేశాడు.

❖ ❖ ❖

చంద్రయ్య తన భూమికి బదులుగా డబ్బు వద్దన్నాడని, ఎందుకూ పనికిరాని పుంత అడిగాడని ఊర్లో అందరూ అతడిని పిచ్చోడిలా జమకట్టారు. "ఈడు పిచ్చోడురా" అన్నట్టు జాలిగా చూసారు.

డబ్బు వదిలేసి పుంత తీసుకొన్నందుకు సాయి తండ్రిపై జువ్వలా లేచాడు. ఒక్క రత్తమ్మ మాత్రం ఏమీ మాట్లాడలేదు. ఆమెకు తెలుసు చంద్రయ్య మనసు.

వారం రోజులు గడిచాయి. చంద్రయ్య భూమిని ప్రభుత్వం కొనుక్కుంది. చంద్రయ్యకు పుంత పట్టా యిచ్చారు. పదివేల రూపాయలు కూడా యిచ్చారు. రాతకోతలు జరిగిపోయాయి. చంద్రయ్య గుడ్లలోంచి నీళ్ళొస్తుంటే కొండ్రను విడిచిపెట్టాడు.

❖ ❖ ❖

"అయ్యా! ఇంక ఈ వూర్లో మనకేం పని. దున్నడానికి భూమి కూడా లేదు. నువ్వేమో ఆ పుంతను తీసుకున్నావాయె. బాగా నష్టపోయాం. లచ్చ పైగా రావలిసింది. పదేలతో సద్దుకున్నావ్. నేను అన్యాయం అయ్యా" సాయి తాడెత్తు లేచాడు.

చంద్రయ్య ఏం మాటాడలే. కట్టలు తెచ్చి కొడుకు ముందు పెట్టాడు.

"సాయి, ఇయిగో డబ్బంతా నీకే ఇచ్చేత్తున్నారా. ఉద్యోగం ఎతుక్కుంటావో, యాపారం చేత్తావో, నీ ఇట్టం. నామటకు ఈడనే వుంటా. నా రోజులు ఈడే పోవాల..."

సాయి డబ్బు కట్టలు చేతిలోకి తీసుకున్నాడు. "సర్లే ఇదైనా ఇచ్చావు. నా బ్రతుకు బతుకుతా. నా దగ్గరకు రావాలనిపిస్తే ఎప్పుడైనా రావచ్చు" విసవిసలాడాడు సాయి. పెట్టె, బేడా తీసుకొని సాయంత్రం పట్నం వెళ్ళిపోయాడు.

❖ ❖ ❖

నెల గిర్రున తిరిగింది. చంద్రయ్య పొలంలోంచి కాలువ పారింది. పల్లంలో భూములు పులకరించాయి. పది గ్రామాలలోని బీద, బిక్కి, చిన్నకారు, సన్నకారు రైతులు భూములకు నీరందింది సకాలంలో కాలువ త్రవ్వకం, ప్రభుత్వం ఖర్చెట్టిన డబ్బు ఒకెత్తయితే, చంద్రయ్య భూమినివ్వడం మరొకెత్తు. చంద్రయ్య ఉదారతే ఎక్కువ మొగ్గింది. అందరూ చంద్రయ్యను పొగిడిన వారే. కాని చంద్రయ్యలో ఏదో చెప్పలేని నిరాశ గూడు కట్టుకుంది. ఎంతో సంతోషంతో నవ్వే చంద్రయ్య, గలగలా నవ్వే చంద్రయ్య ఏడి! ఆ కన్నుల్లో వెల్తురేదీ?

❖ ❖ ❖

చూస్తూ వుండగానే నాలుగు సంవత్సరాలు గడిచిపోయాయి. చంద్రయ్య తన పుంతను బాగు చేశాడు. రాయి, రప్పా అన్నీ తీసేశాడు. చేతిలో చిల్లి గవ్వ లేదు. అయినా డీలాపడలే. అతని శ్రమ, రత్తమ్మ అండతో చిన్న బావి తవ్వాడు. పూల మొక్కలు, పండ్ల మొక్కలు నాటాడు. మొక్కలెదుగుతున్నాయి. పువ్వులు పూస్తున్నాయి. ఆదాయం వస్తోంది. చంద్రయ్య గుండెల్లో ఆనందం పొంగింది. "ఇప్పుడు నాతో మొక్కలు మాట్లాడుతున్నాయిరా. రాత్రేళ చుక్కలు ఊసులాడుతున్నాయ్. నడుం వాల్చినప్పుడు చల్లని గాలి ఇంజామర ఈస్తోంది. భూదేవి నాకు వన్నం పెట్టిందిరా" అంటున్నాడు కనపడిన వాళ్ళందరితో. "మా జీవితం మల్లా చిగురోసింది" అంటుంది రత్తమ్మ కానీ చంద్రయ్య కళ్ళల్లో ఏదో ఎల్తి...

❖ ❖ ❖

ఆ రోజు ఉదయం ఏడైంది. సాయి చిన్న పెట్టెతో తండ్రి ముందర నిలబడ్డాడు. "అయ్యా..." ఏదో చెబుతున్నాడు.

"సాయీ నాకంతా అర్ధమైందిరా. నేలతల్లి దయుంటే మనకేం కట్టం? ఆ యమ్మ చలవ వల్ల ముద్దకు లోటులేదురా..."

"అవునయ్యా! నాకూ ఎరికైంది"

పెట్టె గూడుమీద పెట్టి బైటకు నడిచాడు సాయి.

"ఎక్కడికిరా! అన్నంతినెల్లు"" అంది రత్తమ్మ.

"మన తోటకాడికమ్మా!"

కొడుకు మాటలు విన్న చంద్రయ్య కన్నుల నిండా వెలుతురు పొంగి పొర్లింది.

"ఎంతకాలమైందయ్యా ఆ ఎలుతురు చూసి!" అంది రత్తమ్మ మెల్లగా కన్నుల్లో పొంగి వస్తున్న నీరు తడుచుకుంటూ. ■